క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



గోవర్ధనగిరిలో ప్రచారం

బంగారుపాళెం: మండలంలోని గోవర్ధనగిరి, కురప్పల్లెలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై బంగారుపాళెం కమిటీ–2 సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఐరాల: మండలంలోని నాంపల్లె రెవెన్యూ గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సకల దేవతలను ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవాలు పది రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం హరికథ, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరించాలని కోరారు.

వేడుకగా కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పూతలపట్టు: మండలంలోని పేటపల్లిలో ఆదివారం కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు కోదండరామస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం 9 గంటలకు భక్తుల మధ్య వైభవంగా పవిత్ర పుణ్యజలాలతో కుంభాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

అలరించిన అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని తయ్యూరు పాయకట్టు, అంకనపల్లిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. ద్రౌపదీదేవి, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం 11 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. పైనుంచి విబూది, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద వరపడి స్వామివారిని వేడుకున్నారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు.

చిత్రలేఖనంపై అవగాహన



విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం

కార్వేటినగరం: విద్యార్థులు చిత్రలేఖనంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం కూడా విద్యాబోధనలో ఒక భాగమన్నారు. బొమ్మలు గీయడానికి కొన్ని మెలకువలు పాటిస్తే ఆ బొమ్మ అందంగా కనిపిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో భాగంగా రకరకాలైన బొమ్మలతో పాటు జాతీయ పక్షి నెమలి బొమ్మను గీసి విద్యార్థులకు నేర్పించారు. విద్యార్థులు బొమ్మలు గీయడం వల్ల వారి చేతి నైపుణ్యత వెలికి తీయవచ్చన్నారు. గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, యుగంధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు దందా

- ఆస్పత్రిలో విధులు.. బయట వ్యాపారం
- అనవసరంగా ల్యాబ్ టెస్టులు
- ఒక టెస్టుకు సిబ్బందికి కమీషన్
- పట్టించుకోని ఆస్పత్రి అధికారులు
- ఏపీవీపీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



థైరాయిడ్ పరీక్ష పరికరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ (ఫైల్)

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలానికి చెందిన జ్యోతి అనే మహిళ రెండు రోజుల క్రితం తలతిరుగుడు, ఆయాసం అధికంగా ఉందని జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించింది. అక్కడ చికిత్స చేసిన వైద్యులు వడదెబ్బకు గురైనట్లు నిర్ధారించి అడ్మిట్ చేసుకున్నారు. శనివారం రాత్రి థైరాయిడ్ టెస్ట్ చేసుకోవాలని డ్యూటీ డాక్టర్ సూచించారు. ఆదివారం ఉదయం ఇందుకు ప్రైవేటు ల్యాబ్ వ్యక్తిని పిలిపించి ఆస్పత్రిలోనే శ్యాంపిల్స్ తీయించారు. ఇందుకు అతడు రూ.650 వసూలు చేశారు. (దీనిపై డాక్టర్లను వివరణ కోరగా వడదెబ్బకు, థైరాయిడ్ టెస్ట్‌కు సంబంధం లేదని జవాబుబిచ్చారు.)

- చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్ ఇందిరమ్మకాలనీకి చెందిన శిరీష (13) అనే బాలిక కడుపు నొప్పి, జ్వరం, విరేచనాలు ఉన్నాయని అడ్మిట్ చేసుకున్నారు. థైరాయిడ్ టెస్ట్ చేసుకోవాలని చార్ట్‌లో రాశారు. దీంతో ఉదయానికి వచ్చిన సిబ్బంది టెస్ట్ చేయించుకోవాలని ప్రైవేటు వ్యక్తిని పిలిపించి శ్యాంపిల్స్ తీయించారు. దీంతో ఆ బాలిక తల్లి రూ. 300లే ఉందని చెప్పింది. రూ.650 అంటే ఇచ్చుకోలేమని ఆవేదన వ్యక్తం చేసింది.
- ఒక్కొక్కరికి నెలకు రూ.లక్షల్లో వేతనాలు, కానీ వంద, రూ.200లకు కుక్కుర్తిపడే మనస్తత్వాలు. పేరుకు దేవుడితో సమానమైన వైద్యులు, సిబ్బంది..కానీ కొందరు కమీషన్లు తీసుకుని వైద్యసేవలు అమ్ముకునే వాళ్లు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జబ్బుబారినపడి చికిత్స కోసం వస్తే కొందరు వైద్యులు అవసరం లేకున్నా వివిధ పరీక్షలను బయట చేయించుకురావాలని ప్రైవేటు ల్యాబ్‌లను బతికిస్తున్నారు. వాళ్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి సామాన్యుల నెత్తిన అదనపు భారం మోపుతున్నారు.
- జిల్లా ఆస్పత్రిలో ప్రైవేటు పంజా అలుముకుంది. ఆస్పత్రిలో విధులు చేస్తూ..బయట వ్యాపారాన్ని బలపరుచుకుంటున్నారు. అమాయక ప్రజల జేబులకు కత్తెరపెడుతున్నారు. కొందరు డాక్టర్లు, సిబ్బంది ప్రైవేటు దందాకు కొమ్ముకాస్తున్నారు. అనవసరంగా టెస్టులకు రాయిస్తూ కాసులు కొల్లగొడుతున్నారు. దీని ద్వారా సిబ్బందికి రూ.100 నుంచి రూ.200వరకు కమీషన్ ముట్టుతోంది. దీనిపై ప్రశ్నించినా, టెస్టులు వద్దని చెప్పినా సిబ్బంది బలవంతం చేస్తూ..చీదరింపులకు గురిచేస్తున్నారు.
- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 450 పడకలు ఉన్నాయి. ఇక్కడకు వివిధ అనారోగ్య సమస్యల నిమిత్తం రోజుకు 1000కిపైగా ఓపీలు వస్తుంటాయి. దీంతో పాటు అత్యవసర చికిత్స కోసం 200 నుంచి 300 కేసులు వస్తుంటాయి. కొన్నిరోజులుగా ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు.

దీంతో ఆస్పత్రిలో అడ్మిట్‌ల సంఖ్య పెరిగింది. వడదెబ్బ కారణంగా రోజుకు 150కుపైగా ఓపీలు వస్తున్నాయి. ఇందులో పదుల సంఖ్యలో అడ్మిట్ అవుతున్నారు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు డాక్టర్లు, సిబ్బంది ల్యాబ్‌టెస్టుల మాటున కాసులపర్వానికి తెరతీస్తున్నారు. అనవసరంగా ల్యాబ్ టెస్టులకు రాస్తూ, ప్రైవేటు ల్యాబ్‌ల జేబులు నింపుతున్నారు.

టెస్టుల పేరిట కాసుల దందా..

ఆస్పత్రిలో అత్యధిక సంఖ్యలో వైద్యులు, 600 పైగా సిబ్బంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొంత మంది ఆస్పత్రి చుట్టూ పక్కల అనధికారికంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే రోగులకు చికిత్స చేసి విచ్చలవిడిగా ల్యాబ్ టెస్టులకు రాయిస్తున్నారు. ఇందులో చాలా మందికి టెస్టులు అవసరం లేకున్నా.. పలు రకాల టెస్టులు చేసుకోవాలని ఒత్తిడి పెడుతున్నారు. వెంటనే ఆస్పత్రి సిబ్బంది ప్రైవేటు ల్యాబ్‌కు ఫోన్‌లో సమాచారం ఇస్తుండడంతో ల్యాబ్ నిర్వాహకులు నేరుగా ఆస్పత్రిలోని రోగుల వద్దకే వచ్చి బ్లడ్ శ్యాంపిల్స్ సేకరిస్తారు. ఇలా సేకరించి శ్యాంపిల్స్‌ను నిర్దేశించిన సమయంలోపు ఫలితాలు ఇస్తుంటారు. ఇందుకు రోగుల నుంచే డబ్బులు వసూళ్లు చేసుకుంటారు. ఇందులో నుంచి సిబ్బందికి రూ.100 నుంచి రూ.200వరకు కమీషన్ ఇస్తుంటారు. దీనికి అలవాటు పడ్డ కొందరు అనవసర టెస్టులను ప్రోత్సహిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే రోగులను సిబ్బంది భయపెడుతున్నారు. దీంతో చాలా మంది రోగులు బయటకు చెప్పలేక మిన్నకుండిపోతున్నారు. గుండె సంబంధిత పరీక్షలు, థైరాయిడ్, సీబీసీ, ఆర్‌బీఎస్, కిడ్నీ, క్యాన్సర్, పీఏపీ స్మెర్స్, బయాప్సీ టెస్ట్ వంటి పరీక్షలను ఎక్కువగా ప్రైవేటు వ్యక్తులను రప్పించి రోగుల వద్ద కాసులు దండుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

సాకులు ఇలా..

ల్యాబ్ టెస్ట్ కోసం వెళితే మధ్యాహ్నం వరకే పని చేస్తున్నాయి. ఆపై టెస్టులు చేయడం లేదు. అత్యవసరమైతే బయటికి తరిమేస్తున్నారు. రాత్రి పూట వస్తే అవస్థలు తప్పడంలేదు. ఆసమయంలో ప్రైవేటు ల్యాబ్‌లే దిక్కుగా మారుతున్నాయి. పగటి పూటే చాలావరకు ఇక్కడ టెస్టులు చేయడం లేదని బోర్డు పెట్టేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తీసిన శ్యాంపిల్స్‌ను పరీక్షించకుండానే రిపోర్ట్ ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇవన్నీ వెరసి పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

ఆస్పత్రిలోనే పరీక్షలు చేసేలా...

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను, రసాయనాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సరఫరా చేస్తోంది. ఫిబ్రవరి నెలలో కూడా ప్రభుత్వం థైరాయిడ్ చేసే పరికరం, బయో కెమిస్ట్రీ ఫుల్లీ ఆటో ఎనలైజర్, ఆటోమెటిక్ టిష్యూ ప్రాసెసర్, పీటీ ఐనర్ వంటి రూ. 94 లక్షలు విలువ చేసే పరికరాలను ఆస్పత్రికి సమకూర్చింది. అయినా ఈ రకమైన టెస్టులకు ప్రైవేటు నుంచి వ్యక్తుల నుంచి పరీక్షలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. టెస్టులు చేయకుండా పరికరాలను తాళం వేసి ఉంచారని, దీంతో పేద ప్రజలు వివిధ రకాల పరీక్షలకు చేతులు కాల్చుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ల్యాబ్ టెస్టుల దందాపై ఏపీవీపీ కమిషనర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

రూ.650 అడిగారు...



మాపాపకు జ్వరం, కడుపు నొప్పి ఉంటే అడ్మిట్ చేశాం. థైరాయిడ్ టెస్ట్‌కు రాయించారు. ఇందుకు రూ.650 తీసుకుని ఇక్కడే వచ్చి రక్తం తీసుకున్నారు. నా దగ్గర రూ.500లే ఉందని ఇచ్చాను. మళ్లీ రూ.150 ఇవ్వాలన్నారు. చేసేది లేక ఇచ్చాను.

–చిన్నపొన్ను, చిత్తూరు

అనవసరంగా టెస్టులు రాస్తున్నారు...



వడదెబ్బ ఉందని డాక్టర్లు తమ తల్లిని శనివారం ఉదయం అడ్మిట్ చేశారు. ఓపీలోని డాక్టర్లు ఒకటికి రెండుసార్లు చూసి వడదెబ్బే అని నిర్ధారించారు. రాత్రి వచ్చిన ఓ డాక్టర్ ఆమెకు సంబంధం లేకుండా థైరాయిడ్ టెస్ట్ రాయించారు. ఇందుకు రూ.650 గుంజుకున్నారు. ఇదేమని అడిగితే డ్యూటీ సిబ్బంది నోరు మెదపడంలేదు. ఆస్పత్రిలో అన్ని పరీక్షలు చేస్తుంటే బయట చేసుకోమనడం విడ్డూరంగా ఉంది.

– దేవన్న, చిత్తూరు

విచారిస్తాం...

టెస్టులు బయట చేయిస్తున్నారనే విషయం మాకు తెలియదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తాం. ప్రైవేటు ల్యాబ్‌కు ఏవరైనా సహకరిస్తుంటే కచ్చితంగా వారిపైనా చర్యలు తీసుకుంటాం. పేద ప్రజలకు ఉచితంగా టెస్ట్ చేసేలా చూస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులను బయటకు వెళ్లకుండా చూస్తాం. ప్రైవేటు వాళ్లకు కొమ్ముకాస్తున్నవారిని వదిలిపెట్టాం.

– డాక్టర్ అరుణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

చిత్తూరులో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే



చిత్తూరు రూరల్: నగరంలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డేను నిర్వహించారు. జిల్లా లెప్రసీ, టీబీ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశాఖ అధికారులు రవికుమార్, జాన్, కృష్ణ, కనికరాజ్, దేవన్ పాల్గొన్నారు.

జాతర ప్రసాదాల వితరణ

పలమనేరు: పట్టణంలో ఇటీవల జరిగిన గంగమ్మ జాతర ప్రసాదాలను ఆలయ కమిటీ ఆదివారం వితరణ చేసింది. ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావణిగౌడకు అమ్మవారి సారె, ప్రసాదాలను కమిటీ చైర్మన్ నరేష్, సభ్యులు ప్రసాద్‌రెడ్డి అందించారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3–5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందని, స్థానికులు ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయవచ్చని తెలిపారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ 08572–232745, వాట్సప్–9849907885 నంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.

10కే రన్‌లో ఎస్‌ఐ ప్రతిభ



పతకంతో ఎస్‌ఐ రామకృష్ణ

చిత్తూరు అర్బన్: బెంగళూరులో ఆదివారం టీసీఎస్ కంపెనీ వరల్డ్ 10కే రన్‌ను నిర్వహించింది. ఈ రన్‌లో జిల్లా నుంచి చిత్తూరు డీటీసీలో పనిచేస్తున్న ఎస్‌ఐ వి.రామకృష్ణ పాల్గొన్నారు. 10కే రన్‌ను 46నిమిషాల 52 సెకన్లలో పూర్తి చేసి పతకం సాధించారు. గతంలో కూడా ఈయన వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మారథాన్ పోటీల్లో పాల్గొని తన సత్తాచాటారు. ముంబైలో జరిగిన టాటా మారథాన్, కేరళ రాష్ట్రంలోని మునార్ హిల్ మారథాన్, హైదరాబాద్‌లో పాల్గొని పతకాలను సాధించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొని పతకం సాధించడంపై ఎస్‌ఐ రామకృష్ణను పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది అభినందించారు.

శక్తి క్షేత్రంలో భగవద్గీత సప్తాహం

తవణంపల్లె: మండలంలోని సిద్దంపల్లె సమీపంలో ఉన్న విష్ణ్వేశ్వర మహాపిరమిడ్ శక్తి క్షేత్రంలో ఈనెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు భగవద్గీత సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తామని సంస్థ నిర్వాహకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. క్షేత్రంలో 18వ తేదీ నుంచి సామూహిక ధ్యాన యజ్ఞం జరుగుతుందని వివరించారు. భగవద్గీత సప్తాహంలో పాల్గొని ఆత్మజ్ఞాన పొందాలని కోరారు. ధ్యానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదలంటే అంత చులకనా బాబు!

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల రాస్తారోకో



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, నిర్మాణాలపై చంద్రబాబునాయుడు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు నిరసనగా చిత్తూరులో గాంధీ విగ్రహం ఎదుట ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి రాస్తారోకో నిర్వహించారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు నినదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తుంటే అంత గొప్ప కార్యక్రమాన్ని కోర్టుకు వెళ్లి అడ్డుకునేందుకు బాబు ప్రయత్నించాడని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తీరా కోర్టు నుంచి పేదలకు అనుకూలంగా తీర్పు వస్తే ప్రభుత్వం ఇచ్చే స్థలం శవాలను పూడ్చే స్థలాలుగా చిత్రీకరిస్తూ మాట్లాడడం పేదలను అగౌరవపరచడమేనని మండిపడ్డారు. సమాధికి 40 అడుగుల స్థలం సరిపోతుందని పేదలకు 440 అడుగుల పైగా స్థలం ఇస్తున్నారని చంద్రబాబు హేళనగా మాట్లాడడాన్ని చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి దుయ్యబట్టారు. రాజకీయాల్లో సీనియర్ నేతగా తనకు తానే గొప్పలు చెప్పుకునే చంద్రబాబు బడుగు, బలహీనవర్గాలంటే చిన్న చూపు తగదని మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. త్వరలో టీడీపీని ప్రజలు సమాధి చేసి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, గుడిపాల మండలాధ్యక్షుడు జనార్దన్, కార్పొరేటర్లు జ్ఞానజగదీష్, హరిణిరెడ్డి, పూర్ణ, చల్లాముత్తు, సర్పంచ్ త్యాగరాజులు, నేతలు కృష్ణారెడ్డి, శేఖర్, ప్రేమ్ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా జగనన్న కిట్లు



తవణంపల్లెలో జగనన్న విద్యా కానుక కిట్లు

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి రానున్న విద్యా సంవత్సరానికి ముందస్తుగా విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. 2023–2024 విద్యాసంవత్సరానికి మండలంలో 2,841 మంది విద్యార్థులకు కిట్లు అవసరమని మండల విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. దీంతో ప్రభుత్వం విడతల వారీగా కిట్లను మండల కేంద్రానికి సరఫరా చేశారు. తవణంపల్లె హైస్కూల్లో జగనన్న కిట్లను భద్రపరిచారు. మండలంలోని ఒకటో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు జగనన్న కిట్లు వచ్చాయి. మండలానికి నోట్‌బుక్స్, షూలు, స్కూల్ బ్యాగులు రావాల్సి ఉంది. జూన్ 12వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు జగనన్న కిట్లు అందజేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. దీనిపై ఎంఈఓ శంకరయ్యను వివరణ కోరగా వారం రోజుల్లో అందరు విద్యార్థులకు సరిపోయే జగనన్న కిట్లు తవణంపల్లెకు వస్తాయని వివరించారు. కిట్లు వచ్చిన వెంటనే ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. కావలసిన కిట్లను జిల్లా అధికారులకు సమాచారం అందించి తెప్పించుకుంటామన్నారు.

ముందు జాగ్రత్తతోనే..!

- గ్రామాల్లో ఆటలమ్మ కేసులు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

చిత్తూరు రూరల్: వేసవికాలం ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. మార్చి నెల నుంచే ఎండలు మండుతున్నాయి. మరోవైపు గ్రామాల్లో చికెన్ పాక్స్, గవదబిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి సోకే అవకాశమున్నా నిర్లక్ష్యం చేస్తే ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు.

చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఈ ఎండల దాటికి చికెన్‌పాక్స్ వ్యాపిస్తోంది. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా విజృంభిస్తోంది. చిన్న పెద్ద తేడా లేకుండా ఈ వ్యాధి బారినపడుతున్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారు ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టడంలేదు. ఇంటి వైద్యానికే పరిమితమవుతున్నారు. ఇలాంటి తరుణంలో జాగ్రత్తలు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నగర, మండల వ్యాప్తంగా ఈ కేసులు 150 దాకా ఉండవచ్చునని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగ్గా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచనమేరకు యాంటీవైరల్, యాంటీ బయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆటలమ్మ సోకిన వారిని మిగతావారికి దూరంగా ఉంచాలి.
- వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వాలి.
- గవదబిళ్లలు వచ్చినవారు నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలను ఇవ్వాలి.
- చికెన్ పాక్స్, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి..

ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– భాస్కర్, బీఎన్‌ఆర్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారి

ఐఎస్‌ఐ మార్కు వస్తువులనే కొనండి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : వినియోగదారులు ప్రతిఒక్కరూ ఐఎస్‌ఐ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని స్టాండర్డ్స్ ప్రమోషన్ అధికారి కృష్ణవీర్‌వర్మ అన్నారు. ఆదివారం మండలంలోని 9వ మైలు వద్ద ఉన్న ఆశ్రమం సమావేశ భవనంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ వారి సౌజన్యంతో మహిళలకు, విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ కల్పించారు. వారు మాట్లాడుతూ ఐఎస్‌ఐ గుర్తు ఉన్న వస్తువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రతి నిత్యం వాడుతున్న గ్యాస్ సిలిండర్ మీద కూడా మంచి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బంగారంపై వాల్‌మార్కు హెచ్‌యూఐడీ మార్కు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ఐఎస్‌ఐ క్యార్ మొబైల్ యాప్‌ను ఉపయోగించుకుని మరింత సమాచారం తెలుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో క్రాస్ ఎన్‌జీఓ రూరల్ యాక్షన్ సంస్థ భూపతి, చందు, బేబీ, పద్మావతి, ట్రైనర్స్ జ్యోతి, సరస్వతి, మణి పాల్గొన్నారు.